వీధి కుక్కల నియంత్రణకు కృషి

- మేయర్ దండు నీతూకిరణ్
- నగరంలో కంట్రోల్ రూం ఏర్పాటు



నగరంలోని డీఆర్సీ సెంటర్‌ను పరిశీలిస్తున్న మేయర్ నీతూకిరణ్, కమిషనర్ మకరంద్, అధికారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో కొన్నేళ్లుగా వీధి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని నిర్వహిస్తూ, వీధి కుక్కలకు సంతాన ఉత్పత్తి కలగకుండా ఆపరేషన్ చేసి కుక్కల నియంత్రణకు కృషి చేస్తున్నామని మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని డీఆర్సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వీధి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌తో కలిసి మేయర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లిదండ్రులు చిన్నపిల్లలను చీకటి సమయాల్లో ఒంటరిగా బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. ఎవరైనా ప్రమాదవశాత్తు కుక్కకాటుకు గురైతే స్థానిక జనరల్ ఆస్పత్రికి వెళ్లాలని, అక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు నగరంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వీధిలో సంచరించే కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకొచ్చి ఆపరేషన్లు చేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉన్నట్లయితే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08462–220234కు సమాచారం అందించాలన్నారు. వెంటనే ప్రత్యేక బృందం ఘటన స్థలానికి వచ్చి కుక్కలను తీసుకెళ్తారని తెలిపారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ సాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 20వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మేయర్ దండు నీతూకిరణ్ భూమిపూజ చేశారు. అలాగే న్యూ బ్యాంకు కాలనీలో పార్కు ప్రహరీ, డ్రెయినేజీ నిర్మాణా పనులను ప్రారంభించారు. శాస్త్రినగర్‌లో లాల్‌బహదూర్ శాస్త్రి పార్కు ప్రారంభించారు. కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


20వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ నీతూకిరణ్

నేటి చిత్రం..


నగరంలోని బస్టాండ్ ప్రాంగణంలో నిలిచి నీరు

అధ్వానంగా బస్టాండ్

నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ అధ్వానంగా మారింది. ప్రాంగణంలోని రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వర్షాపునీరు నిలిచి ఉంటుంది. గుంతల రోడ్డుపై బస్సుల రాకపోకలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బస్టాండ్ ఆవరణను శుభ్రంగా ఉంచాలని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

'మిషన్ భగీరథ'లో లోపాలు ఉండకూడదు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పంప్‌హౌజ్‌ల పరిశీలన


ఇందల్వాయి పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇందల్వాయి: మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడా కూడా లోపాలు ఉండకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఇందల్వాయి మండలంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా నిరంతర పర్యవేక్షణతో స్వచ్ఛమైన నీటిని అందించాలని సూచించారు. గ్రామాల్లో నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకున్నామని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు గోవర్దన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, గంగారెడ్డి, సుధాకర్, ఎల్‌ఐసీ గంగాధర్, దన్లరాజు, చింతల కిషన్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామంలో గల మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌ను శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి పరిశీలించారు. భగీరథ పథకం ద్వారా అందిస్తున్న మంచినీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, అనంతరెడ్డి, నాయకులు సర్సారెడ్డి, జితేందర్ నాయక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన చేప పిల్లలు ఇవ్వాలి



ఇందల్వాయి: గంగపుత్రులకు ప్రభుత్వం వంద శాతం రాయితీతో అందించే చేప పిల్లల్లో నాణ్యత లోపించిందని, ఇకనైనా సుమారు 80ఎంఎం ఉండే నాణ్యమైన చేప పిల్లలని అందించాలని మండల గంగపుత్ర సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం ఇందల్వాయి తహసీల్దార్ వెంకట్‌రావుకు వినతిపత్రం అందించారు. రవాట, బంగారు తీగ, మెరుగు, గ్యాస్‌కట్, కొరమీను చేప పిల్లలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ సభ్యులు శ్రీనివాస్, కుమార్, ప్రవీణ్, హనుమంతు, స్వామి ఉన్నారు.

నియామకం


స్వామి యాదవ్

సుభాష్‌నగర్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు బీజేపీ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిలను నియమించారు. ఈమేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందన్ దివాకర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాకు జగిత్యాల్‌కు చెందిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కామారెడ్డికి నిజామాబాద్‌కు చెందిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్‌ను నియమించారు. తమ నియామకానికి కృషి చేసిన పార్టీ రాష్ట్ర నాయకత్వం, స్థానిక నాయకత్వానికి స్వామియాదవ్ ధన్యవాదాలు తెలిపారు

50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలి



డిచ్‌పల్లి: ఉపాధ్యాయులకు 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ, నాలుగు డీఏలు ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో శుక్రవారం ఆయన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సభ్యత్వ నమోదు రసీదులు అందజేశారు. మండల బాధ్యులు రాజేందర్‌గౌడ్, నరేష్‌చంద్ర, రమణ, నారాయణ, సుదర్శన్, ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి



సిరికొండ: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రవిందర్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సబ్ స్టేషన్లలో మరమ్మతులు ఉంటే ఎప్పటికప్పుడు చేసుకోవాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు చంద్రశేఖర్, శివకుమార్, సబ్ ఇంజనీర్ సుధాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి



నిజామాబాద్‌నాగారం: మీసేవ కేంద్రాల ఏర్పాటులో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, వీహెచ్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బీరప్ప కోరారు. ఈమేరకు వారు శుక్రవారం డీఆర్‌డీవో సాయగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ దివ్యాంగులను గుర్తించి మీసేవ కేంద్రాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

కుళ్లిన కూరగాయలతో భోజనం.. పాఠశాలపై ఫిర్యాదు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శ్రీచైతన్య స్కూల్స్‌లో కుళ్లిన కూరగాయలతో భోజనం పెడుతున్నారని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వారు డీఈవో దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. శ్రీచైతన్య విద్యాసంస్థల్లో నాసిరకం భోజనం పెడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. వెంటనే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, హాస్టల్ పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రిన్స్, రవీందర్, అక్షయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించడం అందరి బాధ్యత



ధర్పల్లిలో ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు.. ధర్పల్లి బస్టాండ్ ప్రాంగణంలో..

ధర్పల్లి: మొక్కలను నాటడం, ప్రతి మొక్కను సంరక్షించడం అందరి బాధ్యత అని ఎంపీడీవో బాలకృష్ణ, ఆర్టీసీ ఆర్ఎనం జానీరెడ్డి అన్నారు. ధర్పల్లిలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి వారు మొక్కలను నాటారు. అలాగే ధర్పల్లి ఊర చెరువు కట్టపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటారు. బస్టాండ్ ప్రాంగణంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ను కంట్రోలర్ గంగాధర్‌కి అప్పగించారు. ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్, ఏపీవో వినోద, డిపో మేనేజర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


మోపాల్‌లో..

మోపాల్: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. ఏఎస్ఐ రమేష్‌బాబు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



డిచ్‌పల్లి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ యోహాన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ)ని శుక్రవారం ఆయన ఎంపీడీవో రవీందర్‌తో కలిసి తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఘన్‌పూర్ జెడ్పీహైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనా సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పలు సూచనలు ఇచ్చారు.

అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



ఖానాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. మంచిప్పలో..


రావుట్ల గ్రామంలో..

నిజామాబాద్‌రూరల్/సిరికొండ/మోపాల్: అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రైతులకు రుణమాఫీ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శుక్రవారం పలు గ్రామాల్లో సీఎం, మంత్రుల చిత్ర పటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, 1వ డివిజన్ కార్పొరేటర్ కోర్వ లలిత, గంగాధర్, కాంగ్రెస్ అధ్యక్షుడు కోర్వ రాజేంద్ర ప్రసాద్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, ఆదివాసీ జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరి, డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగం, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న తదితరులు ఉన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు నిఖిల్, మనోజ్, రవీందర్, రామకృష్ణ, అక్షయ్, ఆకాశ్, దేవిక తదితరులు పాల్గొన్నారు.

హోటల్స్‌లో శుభ్రత పాటించాలి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని హోటల్స్, టిఫిన్, ఫుడ్ సెంటర్లు శుభ్రత పాటించాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. నగరంలోని పలు హోటళ్లు, ఫుడ్ సెంటర్లను శుక్రవారం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, శానిటేషన్ అధికారులు తనిఖీ చేశారు. లహరి హోటల్స్‌లో శుభ్రత లేనందున రూ. 5వేలు ఫైన్ వేశారు. కపిల హోటల్‌లో రూ. 15వేలు ఫైన్ వేశారు. ఆర్ఓ నరేందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌గౌడ్, ఆర్ఐ సతీష్, జవాన్లు పాల్గొన్నారు.

21న దాశరథి జయంతి సభ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని టీఎన్జీవో భవనంలో ఈనెల 21న ప్రజాకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య జయంతి సభ నిర్వహించనున్నట్లు జయంతి నిర్మాణ కమిటీ కన్వీనర్ సిర్ప లింగయ్య తెలిపారు. సభకు కవులు, కళాకారులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజావాగ్గేయకారులు గోరేటి వెంకన్న హాజరవుతున్నారని, ఈసందర్భంగా బహుభాషా కవి సమ్మేళనం, సినిమా పాటలు, సంగీత విభావరి దాశరథి గేయాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కవి దారం గంగాధర్, దాసు, సుధాకర్, చక్రపాణి, సాయిబాబా, శ్రీనివాస ఆర్య, చంద్రశేఖర్, రాధా కిషన్, గౌతమ్, సుజాత, కటారి రాములు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నగరంలో కరెంట్ కోత

నిజామాబాద్‌నాగారం: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు(శనివారం) విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్ 1, 2, 3 చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ హౌస్, తిలక్ గార్డెన్, దుబ్బ, మిర్చి కాంపౌండ్, వినాయక నగర్, బోర్గం, దుబ్బ, ముబారక్ నగర్, సుభాష్ నగర్, అర్సపల్లి, న్యూ హౌసింగ్‌బోర్డు, గూపన్‌పల్లి ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. న్యూ హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. గంగస్థాన్, కంఠేశ్వర్, న్యూ హౌసింగ్‌బోర్డ్, చంద్రశేఖర్‌కాలనీ, బైపాస్ రోడ్డు, విద్యుత్ నగర్, హోటల్ లహరి ఇంటర్నేషనల్, గూపన్‌పల్లి రోడ్డు ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఆధ్యాత్మికం

గ్రామదేవతలకు జలాభిషేకం



మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ దేవతలకు గంగ నీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వీడీసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ, ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నరేష్‌రెడ్డి, దేవిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో..



నిజామాబాద్ రూరల్: మండలంలోని సారంగాపూర్ గ్రామంలో గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు గంగాజలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా బోనాల పండుగ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని మారుతినగర్ లోగల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లు బోనాలు ఎత్తి శివసత్తులుగా వేషధారణ చేశారు. దిశా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్, స్నేహ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, మేనేజర్ మోయిజ్ అహ్మద్, విజయ్ పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సడ్	220
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,700	వెండి (కిలో)	93,500
22 క్యారెట్స్	68,912		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	70	గాజరుగడ్డ	30	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	20	40	దోసకాయ	15	30
దొండకాయ	12	24	ఆలుగడ్డ	30	50
జిల్మినుకాయ	60	90	గోబిగడ్డ	35	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	40	60	చామగడ్డ	35	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	75	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 2డీ(తెలుగు) - 1.00, 7.25
స్క్రీన్-2	భారతీయుడు-2(తెలుగు) -10.20 కల్కి-2898 2డీ(తెలుగు) -4.10, 10.40 - డార్లింగ్(తెలుగు)-1.15
స్క్రీన్-3	కల్కి-2898 2డీ(తెలుగు) -10.20 భారతీయుడు-2(తెలుగు)-1.45,10.45 డార్లింగ్(తెలుగు)-7.50

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)-11.00,6.30 కల్కి-2898 ఏడీ(హిందీ)-2.45 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	బాడ్‌న్యూస్(హిందీ)-10.45, 1.50,7.25,10.30 కిల్(హిందీ)- 4.55
స్క్రీన్-3	ట్విస్టర్స్(ఇంగ్లీష్)-10.15 డార్లింగ్(తెలుగు)-1.05,7.00,10.20 జెస్ట్ ఏ మినిట్(తెలుగు)- 4.25
స్క్రీన్ -4	డార్లింగ్(తెలుగు)-10.40 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-2.00 7.30 ది బర్త్‌డే బాయ్(తెలుగు)-4.50 పేక మెడలు(తెలుగు)-10.20
దేవి	భారతీయుడు-2 (తెలుగు)
నటరాజ్	క్రైమ్ రీల్ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

సంక్షిప్తం

ఉచిత దంత వైద్య శిబిరం



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఆర్టీవో ఆఫీస్‌లో శుక్రవారం మేఘన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బందికి వైద్యులు దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. డీటీసీ ఉమామహేశ్వ రావు, ఎంవీఐ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఖలీల్‌వాడి: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం ఫోన్లను రికవరీ చేసి 15 మందికి అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు టౌన్ వన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తంగా 500 మొబైల్స్‌ను రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు.

బాడీ ఫ్రీజర్ విరాళం

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లి గ్రామానికి శుక్రవారం లయన్స్‌క్లబ్ సహారా నిజామాబాద్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నరసింహారావు, జిల్లా కార్యదర్శి చేకూరి ఉదయ్ సూర్యభగవాన్, ధనుంజయ్‌రెడ్డి, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న వైద్యులకు సన్మానం



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మెడికల్ కాలేజీలోని సర్జికల్ యూనిట్ ఒకటిలో సీనియర్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ సునీల్ కుమార్, అనస్థీషియా ప్రొఫెసర్ కిరణ్ మాదాల ఇటీవల బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సెమినార్ హాలులో జిల్లా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, దళిత కళ్యాణ్ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించి, వీడ్కోలు పలికారు. రామచంద్ర గైక్వాడ్, దౌలత్ చక్రి తదితరులు ఉన్నారు.

అందుబాటులో ట్రీ కట్టర్ మిషన్

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల తీగలను కొట్టివేయడానికి విద్యుత్‌శాఖ అధికారులు కొత్తగా ట్రీ కట్టర్ మిషన్ తెప్పించారు. టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం డీ-2 సెక్షన్ పరిధిలో ఉన్న చెట్ల కొమ్మలను కట్‌చేసి పరిశీలించారు. అలాగే హ్యాండ్‌కట్టర్ అందుబాటులోకి తేనున్నారు.

బ్యాక్‌లాగ్ పరీక్షలకు 14 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం 14 మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉదయం జరిగిన పరీక్షకు 67 మంది విద్యార్థులకు గానూ 60 మంది హాజరైనట్లు, మధ్యాహ్నం 113 మంది విద్యార్థులకు గానూ 106 మంది హాజరైనట్లు తెలిపారు.